ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
5★★★
బుధవారం 13 నవంబరు 2024



ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

చందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ మదన్‌మోహన్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ శాఖ, కరీంనగర్ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం యాసంగి సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, వేరుశనగ, శనగ, నువ్వులు, పొద్దు తిరుగుడు, కుసుమ సాగు చేయాలని సూచించారు. జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రాంతీయ ఆసుపత్రిలోని సర్జన్, ఫిజీషియన్, పీడియాట్రీషియన్, గైనకాలజిస్ట్, మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఫిజీషియన్, గైనకాలజిస్ట్‌ల పోస్టుల అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మిగిలిన పోస్టులకు అర్హులైన వారికి ఎంపిక చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు తెలిపారు. ఇంటర్వ్యూలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పెంచలయ్య, డీఎస్ ఈడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలలో క్విజ్ పోటీలు

వీర్నపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపద్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, మంజుల పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని మార్కండేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.



పార్కులో నిర్మాణం పూర్తయిన వర్క్ షెడ్లు

దారి మళ్లుతున్న షెడ్లు..

- ఇప్పట్లో వర్కర్ టు ఓనర్ పథకం దూరమే
- సెస్‌కు రెండు లీజ్
- నేతన్నలకు తప్పని నిరీక్షణ
- కార్మిక సంఘాల ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వర్కర్ టు ఓనర్ పథకంపై సిరిసిల్ల నేతన్నల ఆశలు సన్నగిల్లుతున్నాయి. మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం వర్కర్ టు ఓనర్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో షెడ్ల నిర్మాణం చేపట్టింది. పనులు పూర్తిచేసి కార్మికులకు అందించాల్సి ఉండగా షెడ్లను ఇతర అవసరాలకు కేటాయిస్తున్నారు. తాజాగా సిరిసిల్ల బైపాస్ రోడ్డులో వర్కర్‌టు ఓనర్ పథకం కోసం నిర్మించిన షెడ్లు గోదాములుగా మారిపోతున్నాయి. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘానికి రెండు గోదాములు కేటాయించారు. ఇతర అవసరాలకు ఉపయోగించడానికి కూడా పరిశీలిస్తున్నారు. దీంతో కార్మికులు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్ర మాల వైపు అడుగులు వేస్తున్నారు. వర్కర్ టు ఓనర్ పథకం షెడ్లను గోదాములకు ఇవ్వవద్దని, పథకాన్ని కార్మికులకు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. జౌళిశాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. వర్కర్ టుఓనర్ పథకాన్ని అందించడంతోపాటు బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నేతన్నల ఉపాధిపై ప్రభుత్వం దృష్టి

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ప్రభుత్వ ఆర్డర్లు లేక నేత కుటుంబాల్లో కార్మికుల ఆత్మహత్యలు విషాదం నింపిన నేపథ్యంలో ప్రభుత్వం మళ్లీ ఆర్డర్లు ఇవ్వడంతోపాటు బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి సంఘాల సభ్యులకు చీరలు అందించే ప్రక్రియను ముందుకు తీసుకొచ్చింది. దీంతో నేత కార్మికుల కుటుంబాల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఇదే క్రమంలో గత ప్రభుత్వం ప్రభుత్వం ఆర్డర్లు అందిస్తూనే శాశ్వత ఉపాధిపై దృష్టి సారించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం శివారులో అపెరల్ పార్కు, వర్కర్ టు ఓనర్ పథకాలకు శ్రీకారం చుట్టారు. అపెరల్‌పార్కులో ఉత్పత్తులు మొదలై మహిళలకు ఉపాధి పొందుతున్నారు. ఇదే క్రమంలో పవర్‌లూం నేత కార్మికులను యజమానులుగా మార్చే పథకం చేరువ కాబోతుందని భావిస్తున్న క్రమంలో ప్రభుత్వం మారిపోయింది. వర్కర్ టు ఓనర్ విధి విధానాల్లో మార్పులు వస్తాయా? లేదా పథకమే ఉంటుందో లేదో? అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా వర్కర్ టు ఓనర్ పథకంపై ప్రభుత్వం నిర్ణయం తేలకపోవడంతో నేత కుటుంబాల్లో సందిగ్ధం నెలకొంది. ఇప్పటికే అపెరల్ పార్కు సమీపంలోని వర్కర్ టు ఓనర్ పథకంలో వర్క్‌షెడ్లు నిర్మించారు. వర్క్‌షెడ్లలో మోడల్‌గా కార్మికులు పరిశీలించడానికి మరమగ్గాలను, కండెల మిషన్లు ఇతర పరికరాలను ప్రదర్శనకు ఉంచారు. దీంతో వీవింగ్ పార్కు అందుబాటులోకి వస్తుందని

మిగతా 8లో



కల్యాణోత్సవానికి ఆలయ ఆవరణలో ఏర్పాట్లు

వైభవంగా వేణుగోపాలస్వామి బహ్మోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేద పండితులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం జాతర మైదానంలో స్వామివారి కల్యాణ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రైతులు సేంద్రియ సాగుపై మొగ్గు చూపాలి



అవగాహన కల్పిస్తున్న రాధిక జైస్వాల్

ముస్తాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ రాధిక జైస్వాల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రం, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాధిక జైస్వాల్ మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలు, పురుగుల మందులు, విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రతీ రైతు ఆర్గానిక్ వ్యవసాయ విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఎస్సై గణేశ్, ఈవో రమేశ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఏఈవో కీర్తన, రేవతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నేడు మినీ జాబ్ మేళా

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ టెక్నికల్ సర్వీస్‌లో వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 11 గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందని, ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.



బోనాలతో బారులుదీరిన భక్తులు

బద్ది పోచమ్మకు బోనాలు

- డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు
- అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

7



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

8

పరిపాలనపై దృష్టి సారించండి

- మాజీ మంత్రి హరీష్ రావు



విలేకరులతో మాట్లాడుతున్న హరీష్ రావు

వేములవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పగ, ప్రతీకారాలు మాని పరిపాలనపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. మంగళవారం వేములవాడలో రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం కలుగజేయాలని వేములవాడ రాజరాజేశ్వరస్వామిని కోరుకున్నానని అన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని వేములవాడ రాజన్న మీద ఒట్టు పెట్టి హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. తెలంగాణ ప్రజల ఇలవేల్పు పైన ఒట్టు పెట్టి మాట తప్పిన ఘనత ఒక రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తప్పనిసరి పరిస్థితులలో ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. పాలన చేతగాని పరిపాలకులు బోనస్ ఇస్తామని నమ్మించారని, కనీసం సన్నాలకైనా బోనస్ ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. ఇక్కడి రైతులకు ఒక రూపాయి బోనస్ ఇవ్వకుండానే మహారాష్ట్ర వెళ్లి తాము బోనస్ ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ఆగస్టు 15 నాటికి కూడా రుణమాఫీ చేయలేదని, దేవుళ్లపై ఒట్టు పెట్టిన వారిలో రేవంత్ రెడ్డి మొదటి వాడని, కనీసం రైతులకైనా న్యాయం జరగాలని వేములాడ రాజన్నను వేడుకున్నానని హరీష్ రావు అన్నారు. 2 లక్షల రూపాయలకుపైగా రుణం ఉన్న రైతులు మిగతా సొమ్ము కట్టాలని నిబంధన ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. అనేక నిబంధనలు, కుంటి సాకుల మధ్య రుణమాఫీ పాక్షికంగా మాత్రమే చేశారని, బేషరతుగా రెండు లక్షల రూపాయలపైన ఉన్నవారికి సైతం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజన్న దగ్గరికి వచ్చి తప్పయ్యిందని వేడుకోవాలన్నారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక అర్హత రేవంత్ రెడ్డికి లేదని, గత 11 నెలల్లో తెలంగాణ ఏం కోల్పోయిందో చర్చించడానికి తాను సిద్ధమని అన్నారు. అనేక రంగాల్లో తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిపోయిందని,

మిగతా 8లో

రాజన్నను క్షమాపణ కోరుకో

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సాక్షాత్తు వేములాడ రాజన్న ఆలయానికి ఏటా వంద కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తానని మాట తప్పినందుకు మాజీమంత్రి హరీష్‌రావు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ముందు చెంపలు వేసుకొని క్షమాపణ కోరుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడలోని ఆయన నివాసంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలను ఖండించారు. హరీష్ రావు మామ రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా వందకోట్లు ఇస్తానని మాట తప్పినందుకు గుడిమెట్ల మీద చెంపలు వేసుకొని క్షమాపణలు కోరుతారని తాను ఆశించానన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా వంద కోట్లు ఇస్తానని హామీ ఇచ్చి ఒక్క రూపాయి కేటాయించకుండా ఒక్క ఇటుక పేర్చకుండా స్వామివారిని మోసం చేసిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. తాము రాజన్న ఆలయ అభివృద్ధికి సంబంధించి హామీ ఇవ్వకుండానే బడ్జెట్‌లో 50 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. పదేళ్ల పాలనలో చేసిన పాపాలతో ప్రజలు మిమ్మల్ని గద్దె దించారని, ప్రజల పోరాటం కారణంగా సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే మీ మామ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాడనే విషయాన్ని గుర్తుంచు కోవాలన్నారు.

సబ్బండ వర్గాల వారు పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే కేవలం కేసీఆర్ కుటుంబంలోని నలుగురు మాత్రమే పదవులను అనుభవించారని, మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడైనా ఒకటో తారీఖు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వంలో ఒకటో తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. 2018 ఎన్నికల్లో తనను ఓడించడానికి

మిగతా 8లో

సర్వేలో తప్పులు లేకుండా చూడాలి

- ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా చూడాలని, ఎన్యూమరేటర్లు అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 17, 28 వార్డుల్లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల ఇంటింటి సర్వేను పరిశీలించారు. సమాచారం ఇవ్వడానికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని పలు కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వివరాలు తీసుకోవాలని అన్నారు. సర్వేపై ప్రజలకు సందేహాలు ఉంటే ఎన్యూమరేటర్లు నివృత్తి చేయాలన్నారు. ప్రజలు అపోహలకు పోకుండా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అన్ని కుటుంబాల వివరాల సేకరణ సమగ్రంగా తీసుకో వాలన్నారు. సర్వేను అధికారులు తనిఖీ చేయాలన్నారు.ఆయన వెంట సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, కమిషనర్ లావణ్య ఉన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ జిల్లాలో సకాలంలో పూర్తి చేసేలా కార్యాచరణ అమలు చేయాలని, ప్రతీరోజు నిర్దిష్ట లక్ష్యం మేరకు సర్వే జరగాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమగ్ర సర్వేపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లాలో 1531 బ్లాక్‌లలో 1,92,432 ఇళ్ల సర్వే చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు 49,918 ఇళ్ల పూర్తయ్యిందన్నారు. 26 శాతం వరకు సర్వే జరిగిందని, గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, బోయినపల్లి మండలాల్లో సర్వే నిర్వహణలో వేగం పెంచాలని సూచించారు. సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ టీచర్ల స్థానంలో రిజర్వ్ సిబ్బందిని వినియోగించుకోవాలన్నారు. ప్రజల నుంచి స్వచ్ఛందంగా సమాచారం తీసుకోవాలని, బలవంతం చేయవద్దని అన్నారు. సర్వే కారణంగా పథకాలు కోల్పోరని ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సీపీవో శ్రీనివాసచారి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకట ఉపేందర్‌రెడ్డి, రాజేశ్వర్, కమిషనర్ లావణ్య, డీఆర్డీవో శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అపోహలు నమ్మొద్దు

వీర్నపల్లి: సోషల్ మీడియాలో వచ్చే అపోహలను ప్రజలు నమ్మొద్దని, సర్వేకు స్వచ్ఛందంగా సహకరించాలని తహసీల్దార్ మారుతి రెడ్డి కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు బాబాయ్ చెర్వు తండా, రాశిగుట్ట తండాలో సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేస్తున్న సిబ్బందికి తప్పులు లేకుండా వివరాలు అందించాలన్నారు. అనంతరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని ఆదేశించారు.

వామ్మో.. కొండచిలువ



ఇంటి నుంచి బయటకు వెళుతున్న కొండచిలువ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేటలోని గంట కుశయ్యగౌడ్ ఇంటిలో మంగళవారం కొండ చిలువ ప్రత్యక్షమైంది. దీంతో కుటుంబసభ్యులు భయంతో పరుగులు తీశారు. సుమారు రెండు గంటలపాటు కొండ చిలువ ఇంట్లో అటూ, ఇటూ తిరిగింది. కొందరు యువకులు కర్ర సాయంతో బయటకు పంపించి హతమార్చారు.

యూరప్‌లో ఉద్యోగం పేరిట రూ. 3.50 లక్షలు వసూలు

ఆర్మీనియా నుంచి తిరిగి వచ్చిన అయిత్‌పల్లి వాసి

ఏజంట్ మోసంపై ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న రాములు

పెగడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యూరప్‌లో ఉద్యోగం పేరిట నమ్మించి రూ. 3.50 లక్షలు వసూలు చేసి ఆర్మీనియా తీసు కెళ్లి తిరిగి పంపించగా బాధితుడు రాములు తనకు న్యాయం చేయాలని కోరుతూ ప్రవాసీ ప్రజావాణిలో మంగళవారం ఫిర్యాదు చేశాడు. పెగడపల్లి మండలం అయిత్ పల్లి గ్రామానికి చెందిన కూన రాములు జగిత్యాలకు చెందిన ఒక లైసెన్సుడు ఏజంట్ మాటలు నమ్మి ఉద్యోగంపై ఆశతో రూ. మూడున్నర లక్షలు చెల్లిం చానని, తనను గత సంవత్సరం సెప్టెంబరు 25న ఆర్మీనియా దేశానికి తీసుకెళ్లి వదిలేశాడని, అక్కడ ఉద్యోగం లభించక జనవరిలో తిరిగి ఇంటికి వచ్చానని ఇంటికి రావడానికి తనకు మళ్లీ రూ. 1.45 లక్షలు ఖర్చయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ప్రభు త్వం న్యాయం చేయాలని వేడుకున్నాడు.

రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు..



సంచులను చూపిస్తున్న మహిళా రైతు

శంకరపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మం డలం కేశవపట్నం పోలీస్ స్టేషన్ ఎదురుగా మంగళవారం వడ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌లోని ధాన్యం బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ రైతు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించారు. వడ్ల లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ కన్నాపూర్ నుంచి బయలుదేరి కేశవపట్నం రైస్‌మిల్‌కు తరలిస్తుండగా కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కేశవపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట ధాన్యం బస్తాలు కూలి రోడ్డుపై పడ్డాయి. పాత సంచులలో ధాన్యం పోసి తూకం వేయడంతో రోడ్డు మీద పడి ధాన్యం బస్తాలు చిరిగి పోయాయి. రోడంతా ధాన్యం చెల్లాచెదురుగా పడిపోవడంతో సదరు రైతు కుటుంబం వచ్చి ధాన్యాన్ని సంచుల్లో పోసి మళ్లీ ట్రాక్టర్‌లో వేసుకొని మిల్లుకు తరలించారు. ధాన్యం బస్తాలు రోడ్డు మీద పడ్డ సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కన్నాపూర్ గ్రామానికి చెందిన మరో ట్రాక్టర్ కేశవప ట్నం రైస్ మిల్లుకు వస్తుండగా ముత్తారం శివారులో రోడ్డు పై ధాన్యం బస్తాలు కూలిపోయాయి.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఒకేరోజు 13 ప్రసవాలు



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో చిన్నారులతో కుటుంబ సభ్యులు

హుజూరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఒకే రోజు 13 మంది గర్భిణులకు ప్రసవాలు మంగళవారం నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావులు తెలిపారు. రెండ్రోజుల క్రితం నెలలు నిండిన మహిళలు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి రాగా, వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పి నిచ్చలారెడ్డి, సోమశేఖర్, వాణిలత ఆపరేషన్లు నిర్వహించారు. ఒకేరోజు 13 ప్రసవాలు జరగడంతో వైద్య సిబ్బందిని పలువురు అభినందించారు.

చలికాలం చిన్నారులు భద్రం



జాగ్రత్తలివే..

రాత్రి వేళ చల్లని గాలులు గదిలోకి రాకుండా చూసుకో వాలి. బయట చలిగా ఉన్న సమయంలో పిల్లలను ఎక్కువ సమయం బయట గడపకుండా జాగ్రత్త వహించాలి. వెచ్చగా ఉండేందుకు మందంగా ఉండే దుస్తులు లేదా స్వెట్టర్లు ధరింపజేయాలి. తలకు మఫ్లర్ (టోపి), చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్స్ వంటి అదనపు రక్షణ దుస్తులు ధరించాలి. చలికాలంలో ముఖం, చేతులు, పాదాలు, మడమలు పగిలిపోవడం సాధారణం. చలి కాలంలో మాయిశ్చరైజర్లు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడి నీటితో స్నానం చేయించాలి. ఆ తర్వాత పొడిగా ఉండే దుస్తులను వేయాలి.

వ్యాక్సిన్ల విషయంలో నిర్లక్ష్యం వద్దు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 12 : చలికాలం వచ్చిందంటే అందరికి జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు తలెత్తుంటాయి. ఈ కాలంలో వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందుతాయి. చిన్న పిల్లలు తరుచూ జబ్బుల బారిన పడుతుంటారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రాత్రి వేళల్లో చలి అధికంగా ఉంటోంది. రాబోయే మూడు నెలలు చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నట్లు వాతా వరణ శాఖాధికారులు ఇప్పటికే హెచ్చరించారు.ఈ నేపథ్యంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. పిల్లలకు వేసే వ్యాక్సిన్ల విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయొ ద్దు. ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం రాకుండా ఉంటుంది. వీటిని ఏడాదికి రెండు సార్లు వేస్తారు. ఆ తరువా ఐదేళ్ల వరకు ప్రతి సంవత్సరం ఒక్కొక్కటి చొప్పున తీసుకోవాలి. సీజనల్ టీకాలు వేయించాలి.

పరిశుభ్రత కీలకం

చలికాలంలో చిన్న పిల్లలు ఉండే గదులను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి. చల్లని వాతా వరణం కావడంతో అనేక వైరస్‌లు విజృంభిస్తాయి. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత అల్పాహారం తీసుకునే ముందు చేతులు, కాళ్లు బాగా కడగాలి. విట మిన్-సీ, ఐరన్, జింక్ వటిమినరల్స్ అధికంగా ఉన్న ఆహారాన్ని అందిస్తే రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. పండ్లు, కూరగాయాలు, గోధుములు, నాటుగుడ్లు వంటివి అందులో చేర్చాలి. చలికాలంలో శరీరానికి చెమట ఎక్కువగా పట్టునందున పిల్లలు తక్కువ నీరు తాగుతుంటారు. వారితో ఎక్కువ నీరు తాగించాలి. వీలైనంత వరకు గోరు వెచ్చని నీరు అందించాలి.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి..

డాక్టర్ మధుకర్, చెల్పూర్ పీహెచ్‌సీ



చలికాలంలో చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వాతావరణంలోని మార్పులు, చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతో పాటు శ్వాస కోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక్కోసారి జలుబు అధికమైతే పిల్లలకు ఆయాసం వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా జబ్బు చేసిన ప్రతిసారి వారికి యాంటీబయోటిక్స్ ఇస్తుంటారు. యాంటీ బయాటిక్స్ ఎక్కువ తీసుకుంటే సహజమైన రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన వైద్యం అందించాలి.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

రామడుగు, నవంబరు 12: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన ఎండీ హుస్సేన్(70) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన ఎండి హుస్సేన్ ఈ నెల 8న రాత్రి బస్సు దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ హుస్సేన్‌కు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. హుస్సేన్ కుమారుడు ఎండి అమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన మూటపల్లి నవీన్(34) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. నవీన్‌కు 13 ఏళ్ల క్రితం లావణ్యతో పెళ్లి అయినట్లు ఆయన పేర్కొన్నారు. దంపతులకు ఒక బాబు ఉన్నాడు. 8 ఏళ్ల క్రితం భార్య తన కొడుకుతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ ఈనెల 11న ధర్మపురిలో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పావుగంటలో ఇళ్లకు చేరుతామనేలోపే..

- రోడ్డు దాటుతున్న మహిళా కూలీలను ఢీకొట్టిన కారు
- ఇద్దరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం





భాగ్యమ్మ, అమృత(ఫైల్)

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పావుగంటలో ఇళ్లకు చేరుతామనుకునేలోపే.. కారు రూపంలో మృత్యువు వారిని కబళించింది. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నలుగురు మహిళలు, పనులు ముగించుకొని తెల్లవారుజామున ఇంటికి వెళుతుండగా వేగంగా వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో మహిళ స్వల్ప గాయాలతో బయటపడింది. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి పట్టణంలోని ఉదయ్‌నగర్‌కు చెందిన నలుగురు మహిళలు కుక్క భాగ్యలక్ష్మి, కుక్క అమృత, కుక్క పద్మ, కుక్క కాంతమ్మలు సోమవారం ఓ ఫంక్షన్ హాల్‌లో వంట పనులు, పాత్రలు శుభ్రపరిచే పనులకు వెళ్లారు. అయితే రిసెప్షన్ అర్ధరాత్రి దాటే వరకు కొనసాగింది. దీంతో వీరిని పనులకు తీసుకున్న వ్యక్తి మంగళవారం ఉదయం 3 నుంచి 4 గంటల ప్రాంతంలో నలుగురు మహిళలను ఇంటికి పంపించారు. ఆక్రమంలో ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న రాజీవ్ రహదారి దాటుతుండగా కరీంనగర్ వైపు నుంచి వస్తున్న కారు నలుగురు మహిళలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుక్క భాగ్యలక్ష్మి(50), కుక్క అమృత (49) అక్కడికక్కడే మృతిచెందారు. కుక్క పద్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. కాంత మ్మ స్వల్ప గాయాలతో బయటపడింది. వీరంతా ఒకే వీధికి చెందిన వారు కావడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని సీఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. సంఘటన స్థలంలో లభించిన విడి భాగాల ఆధారంగా కారు ఢీకొనడం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. కుక్క రాజేశం ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సుల్తా నాబాద్, గోదావరిఖని ప్రాంతాలకు రెండు బృందాలను పంపినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతురాలు అమృతకు భర్త నర్సయ్య, కూతురు, కొడుకు ఉన్నారు. భాగ్యకు భర్త కనుకయ్య, నలుగురు కూతుళ్ల ఉన్నారు.

చెరువులో దూకి వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :అనారోగ్య కారణంతో చింత కుంట చెరువులో దూకి ఓ వృద్ధుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. పట్టణంలోని బీట్ బజార్ ప్రాంతానికి చెందిన పల్లెర్ల కిషన్(70) కొన్ని రోజులుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన కిషన్ సమీ పంలో ఉన్న చింతకుంట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కిషన్ కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బావిలోకి దూకి వృద్ధురాలు..

కరీంనగర్ క్రైమ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన మెంతి పుల్లమ్మ (80) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని కరీంనగర్ పోలీసులు తెలిపారు. పుల్లమ్మ కొంతకాలంగా మానసిక సమస్యలతో అనా రోగ్యంతో బాధపడుతుందని, ఈ క్రమంలోనే సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పుల్లమ్మ కుటుంబ సభ్యులు వెతకగా వారి వ్యవసాయ బావిలోనే మృతదేహం గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

తొమ్మిది మంది అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగిరెడ్డిపల్లె గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, ఎస్సై రాజేష్‌లు గోదావరిఖని టూటౌన్ సిబ్బందితో కలిసి రహ్యా స్థావరం పై దాడి చేశారు. డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్న తొమ్మిది పట్టుబడగా, ఇద్దరు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ. 71,690 నగదును పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు తొమ్మిది మొబైల్ ఫోన్లు, నాలుగు బైక్‌లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని విచారణ నిమిత్తం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ఇసుక డంపులు సీజ్

4 ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలింపు

ఇబ్రహీంపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటికొండపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. 4 ట్రాక్టర్‌లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కోమటికొండపూర్ గ్రామంలో అక్రమంగా ఇసుక డంపులు ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ప్రసాద్ ఆదేశాలతో ఆర్ఐలు రేవంత్‌రెడ్డి, రమేష్, మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీసులు గ్రామంలో దాడులు నిర్వహించారు. 2 చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గుర్తించి దాదాపుగా 35 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 4 ట్రాక్టర్ ట్రాలీలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో రైతు ఆత్మహత్యాయత్నం

తల్లి పేరున భూమి విరాసత్‌ను నిలిపివేయాలని పురుగుల మందు తాగిన వైనం



రోదిస్తున్న రైతు రవి

మానకొండూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన కొయ్యెడ రాజమ్మ-లచ్చయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు రవి, హరీష్ ఉన్నారు. గ్రామంలో లచ్చయ్య పేరు మీద సర్వే నెంబరు 185బి, 196సిలో మూడెకరాల 12 గుంటల భూమి ఉంది. లచ్చయ్య రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. లచ్చయ్య పేరున ఉన్న భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి మూడు రోజుల క్రితం భార్య రాజమ్మ స్లాట్ బుక్ చేసుకుంది. తల్లి రాజమ్మ, తమ్ముడు హరీష్ ఒక్కటై భూమిని పంచకకుండా తల్లి పేరున విరాసత్ చేసుకుంటున్నదని పెద్ద కుమారుడు రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భూమిని తల్లి పేరు మీద విరాసత్ చేయవద్దనిమంగళవారం తహసీల్దార్ బి రాజేశ్వరిని కలిసి కోరాడు. దీంతో తహసీల్దార్ విరాసత్ చేయనని అతడికిచెప్పారు. అప్పటికే మనస్తాపంతో ఉన్న రవి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి బోరున విలపించి కింద పడిపోయాడు. స్పందించిన రెవెన్యూ సిబ్బంది చికిత్స నిమిత్తం 108కు సమాచారం ఇవ్వడంతో వారుకరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈవిషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా లచ్చయ్య పేరున ఉన్న మూడెకరాల 12గుంటల భూమిని విరాసత్ కోసం మూడు రోజుల క్రితం రాజమ్మ స్లాట్ బుక్ చేసుకుందన్నారు. ధరణి నిబంధనల ప్రకారం భర్త పేరు మీద ఉన్న భూమిని భార్యకు విరాసత్ చేయవచ్చని తెలిపారు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు రిజిస్ట్రేషన్ నిలిపివేశామని తహసీల్దార్ చెప్పారు.

ముద్దలుగా మారుతున్న అన్నం

- గురుకుల పాఠశాలలో అన్నం సరిగా లేక విద్యార్థుల అస్వస్థత
- ప్రిన్సిపాల్‌తో తల్లిదండ్రుల వాగ్వాదం



ముద్దలుగా అన్నం

తిమ్మాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో(బాలుర)లో వారం రోజులుగా అన్నం సరిగా లేక విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. గన్నేరువరం మండలానికి సంబంధించిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలను రామకృష్ణకాలనీలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల, కళాశాలలో 450 మంది విద్యార్థులు హస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. వారం రోజుల క్రితం పాఠశాలకు సివిల్ సప్లయిస్ శాఖ నుంచి బియ్యం సరఫరా అయ్యింది. ఆ బియ్యంతో వండిన అన్నం ముద్దలుగా మారుతోంది. సిబ్బంది అదే అన్నం విద్యార్థులకు వడ్డిస్తున్నారు. ఈ అన్నం తింటున్న విద్యార్థుల్లో చాలా మందికి జీర్ణం కాకపోవడంతో కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురవుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా కొందరు విద్యార్థులకు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. మరికొందరిని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి ఇంటికి పంపిస్తున్నారు. మంగళవారం కొందరు తల్లిదండ్రులు పాఠశాలకు రావడంతో ఈ విషయం బయటకు పొక్కింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణతో, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం ఇచ్చినా సరైనా బియ్యం పంపించడం లేదని ప్రిన్సిపాల్ తెలిపారు. పాత బియ్యం అయిపోవడంతో అధికారులు కొత్త బియ్యం పంపించారన్నారు. కొద్ది రోజులుగా ఈ బియ్యంతో కొద్దిగా సమస్యలు వస్తున్నాయని, ఉన్నతాధికారులకు ఈవిషయం తెలియజేశామని తెలిపారు.



అన్నం సరిగా ఉండడం లేదని తెలుపుతున్న విద్యార్థులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

జగిత్యాలరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లోని కండ్లపల్లి గ్రామం మీదుగా బైక్ పై గంజాయి తరలిస్తున్న జగిత్యాల పట్టణా నికి చెందిన సయ్యద్ అఫ్రోజ్‌ను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 583 గ్రాముల గంజాయితో పాటు బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి సరఫరా చేసే వ్యక్తుల పట్ల, గంజాయి సేవించే వ్యక్తుల ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గ్రామాల్లో గంజాయి విక్రయించిన, సేవించిన డయల్ 100కి సమాచారం ఇవ్వాలన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని గుడిపెల్లిలో మంగళ వారం శ్రీరాముల మల్లేశం(51) అనే గీత కార్మికుడు గాయాలపాలైనట్లు తోటి గీత కార్మికులు తెలిపారు. గాయాల పాలైన మల్లేశంను చికిత్స కోసం కుటుంబ సభ్యులు పెద్దప ల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు.నిరుపేద కుటుంబానికి చెందిన మల్లేశంను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో మంగళవారం బైక్‌పై వెళుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లికి చెందిన క్రిష్ణమూర్తి బైక్‌పై కరీంనగర్ వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొంది. క్రిష్ణమూర్తిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించారు.

ఆరోగ్యాన్నిచ్చే గేగులు

- పోషకాలు అధికం
- అందుబాటు ధరల్లో లభ్యం
- ఇష్టంగా కొనుగోలు చేస్తున్న జనం

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మేలు చేసే గేగులు మార్కెట్‌లోకి వచ్చాయి. చక్కని రుచితో ఎక్కువ పోషకాలు కలిగిన గేగులను ప్రజలు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.

గేగులు తయారీ..

తాటిచెట్లకు ముంజల గెలలు ఉంటాయి. ఆ గెలల కాయలు లేతగా ఉన్నప్పుడు కోసి అందులోని ముంజలను తింటారు. కాయలు ముదిరాక అవి పండ్లుగా మారి రాలుతాయి. కొందరు రైతులు వాటిని ఏరి తమ పొలాల ఒడ్డున నీరు పారే ప్రాంతంలో పాతిపెడతారు. అవి మొలకెత్తి పెరుగుతున్న క్రమంలో వాటిని తవ్వితీసి ఆకులు కత్తిరించి కాండాన్ని కుండలో ఉడకబెడతారు. దోరగా అయ్యేలా కాలుస్తారు. వాటి మీది పొరను తొలగించడంతో గేగులు తయారవుతాయి.

ఎన్నో పోషకాలు..

గేగులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో ఫ్యాట్ తక్కువగా పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. చర్మవ్యాధులు రాకుండా, కాలేయం పెరగకుండా, మలబద్ధ నివారణకు తోడ్పడుతుంది. చక్కని రుచిగా ఉండే వంద గ్రాముల గేగులో 1.04 ప్రోటీన్లు, 0.19 శాతం ఫ్యాట్, 76.86 శాతం సుక్రోజ్, 1.66 శాతం గ్లూకోజ్, 3.15 శాతం మినరల్స్, 0.86 శాతం కాల్షియం, 0.05 శాతం పాస్ఫరస్, 11.01 ఎంజీ ఐరన్, 0.7 ఎంజీ కాపర్‌తోపాటు విటమిన్ బీ కూడా ఉంటుంది. ఇన్ని పోషకాలు ఉండే గేగుల ధరలు కూడా తక్కువే. నాలుగు, ఐదు గేగుల కట్టను రూ.15 నుంచి 20 వరకు విక్రయిస్తారు.



ఒకరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లోని పలు ఆలయాల్లోకి చోరీకి పాల్పడిన సంఘటనల్లో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం శిలాజీనగర్‌కు చెందిన పిట్టల అంజయ్యను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని సాయి బాబా కమాన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అంజయ్య తమను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అతడిని పట్టుకొని విచారించామన్నారు. కొంత కాలంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లోని ఆలయాల్లో హుండీలను ధ్వంసం చేసి డబ్బులు దొంగిలిస్తున్నట్లు విచారణలో అంగీకరించాడని వివరించారు. నెల రోజుల నుంచి ఎల్లారెడ్డిపేట, పోతిరెడ్డిపల్లి, బండలింగంపల్లి, ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. అంజయ్య వద్ద నుంచి రూ.1500 నగదుతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకు న్నామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా మహిళాశక్తి క్యాంటీన్లు

- సమగ్ర కుటుంబ సర్వే ఎక్స్‌రేలా ఉపయోగపడుతుంది
- కేటీఆర్ ఆరోపణలనుంచి తప్పించుకునేందుకే ఢిల్లీకి...
- మంత్రి పొన్నం ప్రభాకర్


ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌లో తయారు చేసిన వంటకాలను ఆయన రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు జరుగుతున్నాయని అన్నారు. మొదటి దశలో 600 బస్సులు ఐకేపీ ద్వారా కొనుగోలు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అన్ని మహిళా సంఘాలకు చేనేత చీరలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిరిసిల్లలో యార్న్ బ్యాంక్ తీసుకురావడానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, తాను కలిసి పని చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు 50 లక్షల అప్పు చేశాడని, ఆ అప్పు తీర్చేందుకు మళ్లీ అప్పులు చేశారన్నారు. వికారాబాద్‌లో కలెక్టర్ ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజల అభిప్రాయం తీసుకునేందుకు వెళ్ళగా అక్కడికి ఒక వ్యక్తి వచ్చి కలెక్టర్‌ను వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి దాడి చేశాడని, ఆ వ్యక్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిరసన తెలిపే విధానం ఇదికాదని అన్నారు. ఐఏఎస్‌లకు రక్షణలేదని అన్నవారే రైతుల సంఘటనను ట్రోల్ చేస్తున్నారని అన్నారు. కలెక్టర్‌పై దాడి చేసినా ఊరుకొమ్మంటారా అని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితులపై దాడి చేసిన ఘటన మరిచిపోయారా అన్నారు. సమగ్ర సర్వేపై గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మంది ఎన్యూమరేటర్లు సమాచారాన్ని సేకరిస్తున్నారని, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలున్నచోటనే కులగణనపై ఇబ్బందులు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. సర్వేలో ప్రజలు తెలిపే సమాచారం గోప్యంగా ఉంటుందని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీలాగా వ్యవహరిస్తున్నాయని, ఇందులో భాగంగా తనపై వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు కేటీఆర్ ఢిల్లీ వెళ్లారన్నారు.

తాను బండి సంజయ్ మాదిరిగా జైలుకు పంపుతాం... జైలులో గది నిర్మించాం... అనడంలేదని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, రైస్‌మిల్లర్లు ప్రభుత్వ కొనుగోలులో భాగస్వాములు కావాలని సూచించారు. మిల్లరు ప్రభుత్వానికి చెల్లించాల్సిన 20 వేల కోట్లు బకాయిల లెక్క అప్పగించాలని, లేదంటే ఉపేక్షించేదిలేదన్నారు. పత్తి కొనుగోళ్లు కేంద్రప్రభుత్వం చేస్తుందని, ఎక్కడ ఇబ్బంది తలెత్తినా ఇద్దరు కేంద్ర మంత్రులదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

కళాభారతికి ఆధునిక హంగులు

- చురుకుగా సాగుతున్న ఆడిటోరియం ఆధునీకరణ పనులు
- 14న ప్రారంభించేందుకు ఏర్పాట్లు

కళాభారతి.. కరీంనగర్ నడిబొడ్డున.. బస్టాండ్‌కు సమీపంలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఆడిటోరియం.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాకారులు కళాభారతిలో వేల ప్రదర్శనలు ఇచ్చారు. నామమాత్రపు రుసుముతో అందరికీ అందుబాటులో ఉండే ఈ ఆడిటోరియం పదేళ్లుగా కళావిహీనంగా మారింది. కళాభారతిని మూసి వేసి కార్పొరేషన్ ఎలక్ట్రిసిటీ విభాగం గోదాముగా వాడారు. ఇది చూసి కళాకారులు తీవ్రంగా బాధపడ్డారు. ఇటీవల కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కళాభారతిని సందర్శించి ఆధునీకరించాలని ఆదేశించారు. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 14న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కళాభారతికి పూర్వ వైభవం వస్తుండడంతో కళాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కళాభారతి ఆడిటోరియానికి మళ్లీ మంచి రోజులు రానున్నాయి. పదేళ్ల తర్వాత కళాభారతి నూతన హంగులతో ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. ఒకప్పుడు కళాకారులతో కళకళలాడిన కళాభారతిని తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతి కళాభారతి సందర్శించారు. ఆడిటోరియంను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించి అవసరమైన నిధులను కేటాయించారు. నవంబరు 14 బాలల దినోత్సవం వరకు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కళాభారతిలోనే బాలల దినోత్సవాన్ని నిర్వహించాలని ఆదేశించడంతో పనులు వేగంగా సాగుతున్నాయి.

పదేళ్లుగా నిరుపయోగం

నగర నడిబొడ్డున, బస్టాండ్‌కు అతిచేరువలో జిల్లా నలుమూలల నుంచి వచ్చే వారికి అందుబాటులో ఉన్న కళాభారతి ఆడిటోరియంను పదేళ్ల క్రితం మూసి వేశారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన సామగ్రిని ఉంచేందుకు వినియోగిస్తున్నారు. దీనితో ప్రభుత్వ పరంగా నిర్వహించే సమావేశాలు, కార్యక్రమాలకు జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంను వినియోగిస్తున్నారు. ప్రైవేట్‌గా నిర్వహించే కార్యక్రమాలకు వేదికే లేకుండా పోయింది. హోటళ్లు, ఫంక్షన్‌హాల్స్, ఫిలింభవన్, ప్రెస్‌భవన్ వంటి వాటిని అద్దెకు తీసుకొని సంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకుంటున్న కరీంనగర్‌లో అత్యాధునిక హంగులతో

ఆడిటోరియంలో 400 సీటింగ్‌తోపాటు ముందు రెండు వరుసల్లో వీఐపీ కుర్చీలు, చెక్కటి వేదిక, లైటింగ్, సౌండ్స్, సీలింగ్, ఏసీలు, మహిళలు, పురుషులకు వేర్వేరు మేకప్ గదులు, మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. నవంబర్ 14న పునఃప్రారంభించి మిగిలిన పనులను కూడా పూర్తి చేస్తామని చెబుతున్నారు. దీంతో కళాభారతి ఆడిటోరియంకు మళ్లీ కళ సంతరించుకోనున్నది. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన కళాభారతి ఆడి



40 సంవత్సరాల చరిత్ర

టోరియం వందల సంఖ్యలో సంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, కళలు, కళాకారుల ప్రదర్శనలకు వేదికగా నిలిచింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో నామమాత్రపు చార్జీలతో నగరపాలక సంస్థ ఈ ఆడిటోరియంను అద్దెకివ్వడంతో నెలలో 20 రోజులపాటు వివిధ కార్యక్రమాలతో కిటకిటలాడేది. సెలవురోజుల్లో ఉదయం, సాయంత్రం వేర్వేరు కార్యక్రమాలు కూడా జరిగిన సందర్భాలు ఉండేవి. అలాంటి 'కళా భారతి' ఆడిటోరియం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం గోడౌన్‌గా మారింది.

ఆడిటోరియం నిర్మించాలని కళాకారులు, కవులు, రచయితలు, ప్రజల నుంచి విజ్ఞాపనలు వెల్లువెత్తాయి. 500 సీటింగ్ కెపాసిటీతో ఉన్న కళాభారతి ఆడిటోరియంను కూల్చివేసి ఈ స్థలంలో నూతన ఆడిటోరియం నిర్మించడం కంటే, ఇక్కడ షాపింగ్ కాంప్లెక్సు లేదా నగరపాలక సంస్థ పార్కింగ్ స్థలంతోపాటు గ్రీనరీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించారు. దీంతో కళాభారతి మూలన పడింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ పమేలా సత్పతి కళాభారతి ఆడిటోరియంను ఆదునీకరించాలని ఆదేశిస్తూ 11 లక్షలను కేటాయించడంతో పనులు చేప డుతున్నారు. అవసరమైతే మరిన్ని నిధు లు కేటాయిస్తామని తెలిపారు. దీంతో పనులు ప్రారంభమై ఊపందుకున్నాయి. కళాభారతికి పునర్వైభవం వస్తుండడంతో కళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఆడిటోరియంపైన వేస్తున్న కొత్త షీట్లు

జాతీయ స్థాయిలో విద్యార్థులకు గుర్తింపు


మాట్లాడుతున్న డీన్ జల్లా సత్యనారాయణ

తంగళ్లపల్లి జులై 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభించడం గర్వ కారణమని డీన్ జల్లా సత్యనారాయణ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళశాలలో విలేకరు సమావేశంలో మాట్లాడారు. ఏటా రాష్ట్రంలోని వ్యవసాయ కళాశాలలో కల్చరల్ మీట్ నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లెల్లలో కళాశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవానికి తెలంగాణ వ్యవసాయ కళాశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక య్యారని తెలిపారు. విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందించడతో పాటు ప్రతిభను వెలికి తీయడానికి కల్చరల్ మీట్ దోహద పడుతుందన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఇసుక లారీలను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు


ఆర్‌టీవో కార్యాలయం వద్ద ఉన్న ఇసుక లారీలు

పెద్దపల్లి, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ ప్రాంతంలోని ఇసుక క్వారీల నుంచి ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఎనిమిది ఇసుక లారీలను పెద్దపల్లి శివారులో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పట్టుకున్నారు. లారీల్లో వాటి సామర్థ్యానికి మించి ఇసుకను తరలిస్తు న్నట్లు సదరు అధికారులు గుర్తించారు. నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, జహీరాబాద్‌కు ఇసుకను లారీల్లో తీసుకవెళుతున్నారు. లారీలను పెద్దపల్లి ఆర్‌టీవో కార్యాలయం వద్దకు తరలించి అధికారులకు అప్పగించారు. వీటిపై రాత్రి 8 గంటల వరకు కేసులు నమోదు చేయడం గానీ, జరిమానాలు విధించడం గానీ విజిలెన్స్ అధికారులు చేయలేదు.

రాష్ట్రస్థాయి వ్యవసాయ కళాశాలల కల్చరల్ మీట్


విద్యార్థులతో డీన్ సత్యనారాయణ

తంగళ్లపల్లి నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వ్యవసాయ కళాశాలల కల్చరల్, లీటరరీ మీట్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో మంగళవారం ప్రారంభించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ డీన్ జల్లా సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. మూడు రోజుల పాటు జరిగే కల్చరల్ మీట్‌లో రాష్ట్రంలోని 11 వ్యవసాయ కళశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. మంగళవారం ఆడిటోరియంలో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

కలపతో మహనీయుల చిత్రాలు




చారి చెక్కిన అంబేద్కర్, కేసీఆర్ చిత్రాలు

కలపపై చిత్రాలు చెక్కుతూ అబ్బుర పరుస్తున్నాడు ఆ యువకుడు. వృత్తిరీత్యా వడ్రంగి కావడంతో కర్రలపై చిత్రాలు చెక్కడం వ్యాపకంగా మొదలు పెట్టాడు. ఖాళీ సమయాల్లో దాన్ని పనిగా చేసుకొని మహనీయులు, రాజకీయ నేతల చిత్రాలను చెక్కుతూ అభిమానాన్ని చాటుకుంటున్నాడు.

అబ్బుర పరుస్తున్న యువకుడు

గంభీరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వ్యాపకంగా మొదలు పెట్టిన పని ఆ యువకుడికి ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన చేపూరి సంతోష్‌చారి అనే యువకుడు వృత్తి పరంగా వడ్రంగి. వృత్తి పనితోపాటు కర్రలపై చిత్రాలు చెక్కడం వ్యాపకంగా అలవాటు చేసుకున్నాడు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రాన్ని కర్రపై తీర్చి దిద్దాడు. ఇందుకోసం వారం రోజులుపాటు కష్ట పడ్డాడు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రాన్ని కర్రపై చెక్కి వార్తల్లోకి ఎక్కాడు. కేసీఆర్ చిత్రాన్ని స్వయంగా కేటీఆర్‌కు అందజేసి శభాష్ అనిపించుకున్నాడు. కర్రతో ఎడ్ల బండి టిపాయిని తీర్చి దిద్దాడు. ఇటీవల పుచ్చకాయపై ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాన్ని చెక్కి అందరి దృష్టిని ఆకర్షించాడు.

ప్రత్యేకత చాటుకోవాలి : సంతోష్ చారీ



కర్రలపై చిత్రాలు చెక్కి ప్రత్యేకతను చాటుకోవాలన్నది నా లక్ష్యం. వృత్తిరీత్యా వడ్రంగి పని చేస్తున్న పుడు కర్రలపై రాజకీయ నేతలు, మహనీయుల చిత్రాలు చెక్కాలనే ఆలోచన వచ్చింది. అదే క్రమంలో చిత్రాలు చెక్కడం మొదలు పెట్టాను. ముందుగా కష్టం అనిపించినా ఇష్టంతో పని చేయడంతో సులువుగా మారింది.

కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమిటీ?

- సీఎం ఇలాకాలోనే ప్రజలు తిరగబడ్డారు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత పదకొండు మాసాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఏమిచేయలేదని, ముఖ్యమంత్రి సొంత ఇలాకాలోనే ప్రజలు తిరగబడ్డారని, విజయోత్సవాలకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి 11 నెలల్లో చేసిందేమి లేదన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ సాధించిన రాష్ట్ర అభివృద్ధిని పది నెలల్లోనే నాశనం చేశారని మండిపడ్డారు. పాలన పక్కకు పెట్టి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని, సోషల్ మీడియాలో ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు పెట్టి బెది రిస్తున్నారన్నారు.

ఈ ప్రభుత్వం ఏం చేసిందని విజయోత్సవాలు జరుపుతోందని అన్నారు. ఆరు గారంటీలు, 420 హామీల్లో ఏది పూర్తిగా నెరవేర్చారో ప్రజలకు చెప్పి సంబురాలు చేసుకోవాలన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగం దేశానికి ఆదర్శంగా నిలిచిందని, కాంగ్రెస్ ఇస్తానన్న రైతు భరోసా రాలేదని, రుణమాఫీ 40 శాతం మందికి చేసి 60 శాతం రైతులకు ఎగ్గొట్టారన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు, పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీలు నెరవేరాయా అని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో వేల మందిని రోడ్డున పడేశారని, ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదని రైతులు కల్లాల వద్ద ఎదురుచూస్తూ పడికాపులు కాస్తున్నారని, సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వడం లేదన్నారు. దళితులకు రెండో విడత దళితబంధు ఇవ్వనందుకా? గురుకులాల్లో 37 మంది విద్యార్థులు చనిపోయినం దుకా? చేనేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ ప్రారం భం అయినందుకా? కేసీఆర్‌ను తిట్టడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలో వుండి బూతులు మాట్లాడే వ్యక్తిని ఇంతవరకు చూడలేదని, ఆ పదవికి రేవంత్ రెడ్డి కళంకం తెచ్చిన ఏకైక వ్యక్తి అని విమర్శించారు.

ముఖ్యమంత్రి సొంత ఇలాకాలో కలెక్టర్‌పై దాడి జరి గిందంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ప్రభు త్వాన్ని ఎన్నడూ చూడలేదని, ఇది శాంపిల్ మాత్రమేనని, దీనిని బట్టి చూస్తే కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులను గ్రామాల్లో తిరగనిచ్చే పరిస్థితి లేదన్నారు. విజయోత్సవాలకు వచ్చే నాయకులను హామీలపై నిలదీయాలని ఆయన ప్రజలను కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ విజయోత్సవాలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, రామగుండంలో చిరు వ్యాపారులకు రోడ్డున పడేసినందుకా, కాళేశ్వరం నీళ్ల రామగుండంలో లేకుండా చేసినందుకు సంబరాలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. నవంబరు 14 నుంచి డిసెంబరు 9 వరకు బీఆర్ఎస్ నిరసన కార్యక్ర మాలను చేపడుతుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో సీఎం రేవంత్ రెడ్డి కట్టడాలు కులగొట్టడమే పాలనగా పాలిస్తున్నాడని విమర్శించారు. కొడంగల్‌లో కలెక్టర్‌పై దాడి దారుణమని, ప్రజలను భయబ్రాంతులను గురి చేస్తూ పాలిస్తున్నారన్నారు.. కాంగ్రెస్ నాయకులను నిలదీస్తే తప్ప హామీలు అమలుకావన్నారు.

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కేవలం అధికారం వస్తే చాలు అన్నట్టుగా అమలు కాని హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క హామీ పూర్తిగా అమలు కాలేదన్నారు. ధాన్యం కొలుగోల్లు జరగక ప్రతి గ్రామంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు, వృద్దులకు, ఎవరికి హామీలు అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు చేసుకోవడం ఏమిటని, రాష్ట్రం ఆర్థికంగా, అన్ని రకాలుగా దివాలా తీసేలా పాలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్ సింగ్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పురాజ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండారు శ్రీనివాస్, తగరం శంకర్‌లాల్, రాజు గౌడ్, అభిషేక్ రావు, ఎన్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'కార్తీక' రద్దీ


ధర్మపురిలో గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదకొండవ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, ప్రత్యేక పూజలు చేసి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, బొజ్జ రమేష్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల, (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామిని సన్నిధానం కార్తీక మాసం పురస్కరించుకొని మంగళవారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. మహిళ భక్తులు ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ బేతాళుడి ఆలయంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ నాంపల్లి ఆధ్వర్యంలో భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

రాజన్న ఆలయంలో..

వేములవాడ కల్చరల్,(ఆంధ్రజ్యోతి): రాజ రాజేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ముందు భాగంలో కార్తీక దీపాలను వెలిగించారు.


కొండగట్టులో భక్తుల పూజలు

నరసింహస్వామి ఆలయానికి వెండి మకర తోరణం అందజేత


నరసింహస్వామికి వెండి మకర తోరణం అందిస్తున్న దాతలు

బీర్‌పూర్,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మంగళవారం 6 కిలోల వెండితో చేసిన మకర తోరణాన్ని దాతలు అందించారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన వంగపల్లి సీతమ్మ జగ్గారావు కుటింబీకులు విరాళంగా అందించారు. మకర తోరణం కైంకర్యం విలువ రూపాయలు 6లక్షల 20 వేలు ఉంటుందని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. దాతలను ఆలయ సిబ్బంది సన్మానించారు.

బద్దిపోచమ్మకు బోనాలు


బద్దిపోచమ్మ ఆలయం వద్ద బోనాలతో భక్తుల క్యూ

వేములవాడ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ బద్దిపోచమ్మకు మంగళవారం భారీసంఖ్యలో భక్తులు బోనాలు సమర్పించారు. సోమవారం రాజరాజేశ్వరస్వామి వారిని దర్శిం చుకున్న భక్తు లు మంగళవారం తెల్లవారు జామున మట్టి పాత్రల్లో అమ్మవారికి నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్‌లో రద్దీ నెలకొంది. సుమారు మూడు గంటలపాటు భక్తులు నెత్తిన బోనాలతో నిరీక్షించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పట్నాలను వేసి నైవేద్యాన్ని సమర్పించి ఒడిబియ్యం పోశారు.

న్యూస్ బాక్స్

హరీష్ రావుకు ఘన స్వాగతం

తంగళ్లపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. హరీష్ రావు హైదరాబాద్ నుంచి తంగళ్లపల్లి మీదుగా కోరుట్ల వెళ్తున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, మాజీ సర్పంచులు మాట్ల మధు, అంకారపు రవీందర్, కొయ్యడ రమేష్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రఫీక్, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, రాములు, మల్లేశం, ప్రతాపరెడ్డి, సాయిరెడ్డి, గోపాల్, బాల్‌రెడ్డి, కిషన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

కోనరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అధికారి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. కమ్మరిపేట తండాకు చెందిన ఇస్లావత్ రమేష్ కొన్ని రోజులుగా కరెంటు బిల్లు కట్టడం లేదు. అతడి ఇంటి కరెంటు కనెక్షన్ తొలగించారు. కనెక్షన్ తొలగించిన అధికారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ బిల్లింగ్ మిషన్ పగలగొట్టాడు. సెస్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గంజాయి కేసులో మరొకరు..

కోనరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో ఒకరిని రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన వడ్లూరి వెంకటేష్‌ను గతంలో సుద్దాల కావేరి మిల్లు వద్ద అరెస్టు చేసి రిమాండ్ పంపించారు. అదే కేసులో నిందితుడైన నిజామాబాద్ జిల్లా భీంఘల్ చెందిన ఎంఏ భాషా పరారీలో ఉన్నాడు. పక్క సమాచారం అతడి నివాసంలో అరెస్టు చేశారు.

అసమానతలను తొలగించేందుకు సమగ్ర సర్వే

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానతలను తొలగించి, అందరికీ సమన్యాయం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిందని వేములవాడ ఎమ్మెల్యే విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చారిత్రాత్మక సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభించిందన్నారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు స్వచ్ఛందంగా సమాచారాన్ని అందించాలన్నారు. 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున 85 వేల మంది సర్వే నిర్వహిస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్ర చేసిన సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం దేశంలో



అధికారులతో మాట్లాడుతున్న విప్ అది శ్రీనివాస్

తెలంగాణ ఒక రోల్ మోడల్‌గా నిలిచేలా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్య, ఉపాధి, రాజకీయ, ఉద్యోగ తదితర అంశాలకు సంబంధించిన రిజర్వేషన్లు అమలు చేయడానికి సర్వే ఉపయోగపడుతుందన్నారు. దేశంలో బీసీ ప్రధానిగా చెప్పుకునే నరేంద్ర మోదీ కూడా సర్వే చేసే సాహసం చేయలేకపోయారన్నారు. చాలా సంవత్సరాల క్రితం చేసిన కులగణనను తప్ప ఇప్పటివరకు ఎవరూ నిర్వహించలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో కుల గణన చేసి అందరికీ సమన్యాయం చేస్తామన్నారు. రాష్ట్రంలో వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయన్నారు. రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చిన సందర్భంలో అనేక మంది ఇచ్చిన సలహాలు సూచనల ప్రకారం కులగణన నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కులగణన బిల్లు ప్రవేశపెట్టినపుకపడు ఒక బీసీ బిడ్డగా తనకు మాట్లాడే అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. ప్రజలు అపోహలు పెట్టకో కుండా సర్వేకు వచ్చిన అధికారులకు సహకరిం చాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్వామి, విప్

మానవ జన్మను సార్థకం చేసుకోవాలి

- తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతి

వేములవాడ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భగవంతుడు ఇచ్చిన మానవ జన్మనను సార్థకం చేసుకోవాలని తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతి అన్నారు. కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి శ్రీ మాధవానంద సరస్వతి ప్రవచనాలు చేశారు. వంద కోట్ల జన్మలు అనుభవించిన తరువాతనే మానవజన్మ సిద్ధిస్తుందని, ఈ జన్మలో చేసే పాప పుణ్యాలు భగవంతుడు చూస్తాడని, మానవ జన్మ తరువాత మరో జన్మ ఉండదని అన్నారు. పరమశివుడికి విష్ణుమూర్తికి ఎంతో పవిత్రమైనది కార్తీక మాసమని, కార్తీక మాసంలో చేసే ప్రతి పూజ యోగ నిద్రలో ఉన్న విష్ణుమూర్తికి చేరుతుందని వివరించారు. అనంతరం రాజన్న ఆలయ దేవస్థానం 2025 సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం రాజన్న ఆలయ కళామందిరంలో ఏర్పాటు చేసిన సామూహిక కార్తీక



సామూహిక కార్తీక దీపోత్సవంలో భక్తులు

దీపోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఈవో వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలి

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించేలా చర్యలు చేపట్టాలని, వాహనాలు ఎక్కడా ఆరు గంటలకు మించి ఉండవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1488 మంది రైతుల నుంచి రూ 107.86 కోట్ల విలువైన 46490 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. 336 మంది రైతులకు 995 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ 2.30 కోట్ల డబ్బులు చెల్లించడం జరిగిందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే సిరిసిల్ల 5వ స్థానంలో ఉందన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు, తాత్కలిక గోదాములకు తరలించాలని సూచించారు. అకాల వర్షం కారణంగా పంట నష్టపోయే అవకాశం ఉంటుందని ధాన్యం తరలింపులో అలసత్వం వహించవద్దని అన్నారు. ధాన్యం తరలింపుకోసం ఎక్కడా వాహనాల సమస్య ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర వాహనాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ధాన్యం తరలింపు వాహనాలు 6 గంటల కంటే ఎక్కువగా అగకుండా చూసుకోవాలని అన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలని అన్నారు. రైస్‌మిల్లులు, ధాన్యం దింపడంలో ఎక్కడైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే ఇంటర్‌మీడియేట్ గోదాములకు ధాన్యం తరలించాలని, వాహనాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలని అన్నారు. 300 క్వింటాళ్ల ధాన్యం కంటే అధికంగా కొనుగోలు చేసిన కేంద్రాల నుంచి ధాన్యం తరలించాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని రైతులకు 48 గంటలలోగా ధాన్యం డబ్బులు లభించేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నరకం ధాన్యాన్ని వ్యవసాయ అధికారులు ధ్రువీకరించాలని అన్నారు. గంభీరావుపేట, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లో రైస్‌మిల్లులకు ఇంచార్జ్‌లను కేటాయించాలని అన్నారు. ఈసమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, డీసీఎస్‌వో వసంతలక్ష్మీ, డీఎం రజిత, డీసీవో రామకృష్ణ, డీఎంసీ రాజేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దారి మళ్లుతున్న షెడ్లు

(5వ పేజీ తరువాయి)

సిరిసిల్ల నేతన్నలు భావించారు. వర్కర్‌టు ఓనర్ పథకంలో లబ్ధిదారులను ఎంపిక చేయడానికి కసరత్తు ప్రారంభించిన క్రమంలోనే ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది.

రూ.374 కోట్లతో నిర్మాణం

జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద 88 ఎకరాల్లో రూ.374 కోట్లతో వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. మొదటి విడతలో 1104 మంది కార్మికులకు వర్క్‌షెడ్లను నిర్మించి అందించాలనే లక్ష్యంగా పనులు ప్రారంభించారు. రోడ్లు, నీటి వసతి, కరెంట్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. 46 వర్క్‌షెడ్లను నిర్మించాలనే లక్ష్యంగా పెట్టుకొని నిర్మాణాలు చేపట్టారు. వర్క్‌షెడ్ల నిర్మాణం చివరి దశకు చేరకుంది. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించాలి. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్‌రూంతో కలిపి అందిస్తారు. ఇందులో నాలుగు సెమీ ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర రూ.8 లక్షలుగా ముందు నిర్ణయించారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.15 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో పది శాతం లబ్ధిదారుడి వాటాధనం, 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకం ఏర్పాటు చేశారు. మరమగ్గాల ఎంపిక కోసం తాత్కాలికంగా నాలుగు ఆటోమేటిక్ మగ్గాలను కూడా పార్కులో ఉంచారు. విభిన్నమైన వస్త్రాలను ఇందులో తయారు చేసే అవకాశం ఉంటుంది. అయితే సిరిసిల్లలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మరమగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30,352 ఉన్నాయి. వీటిపై 6500 మంది పని చేస్తున్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో 6 వేల మంది వరకు పనిచేస్తున్న వారు ఉన్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షించే పరిస్థితి ఉంది.

మొదలైన చలి



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పొగ మంచు

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో చలి తీవ్రత మొద లైంది. మంగళవారం కనిష్ఠ ఉష్ణోగ్రత 14.9 నమోదవగా గరిష్ఠ ఉష్ణోగ్రత 34.7 డిగ్రీలుగా నమో దైంది. కనిష్ట ఉష్ణోగ్రతల్లో జిల్లాను ఎల్లో జోన్‌లో ప్రకటించారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కమ్మేసింది. ఉదయం 7 గంటల వరకు రహదారులను పొగమంచు కమ్మేయ డంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాకర్లు ఆలస్యంగా రోడ్లపైకి వచ్చారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



బహుమతి అందజేస్తున్న చక్రపాణి, నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదనంలో పదిహేను రోజులుగా సాగుతున్న జిల్లా స్థాయి ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. ఫైనల్స్‌లో అంకం వారియర్స్ జట్టు విజయం సాధించగా వ్యాలీ లెవన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి బహుమతులు ప్రదానం చేశారు. సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడగట్ల మురళి, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, కల్లూరి రాజు, దూస వినయ్, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

గంభీరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర యూత్ నాయకులు కంచర్ల రవిగౌడ్ ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేటికి అమలు కాలేదన్నారు. బీఆర్ఎస్ యూత్ నాయకులు అక్షయ్‌నారయణ, నవీన్, అనిల్, సాయి, గణేష్ ఉన్నారు.

బోరుబావి తవ్వకాన్ని అడ్డుకున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట పరిధిలోని కిషన్‌దాస్‌పేట శివారులో రైతు పొలంలో అనుమతి లేకుండా బోరు బావి తవ్వుతుండగా అడ్డుకున్నామని తహసీల్దార్ రామచంద్రం మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన రైతు దేవయ్య అనుమతి లేకుండా తన బోరు బావికి వంద మీటర్ల దూరంలోనే బోరు బావిని తవ్విస్తున్నాడని పేర్కొంటూ మహిళా రైతు ఎల్లవ్వ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు

వీర్నపల్లి, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం అడవిపదిరలో వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ధాన్యాన్ని తరలించేందుకు రైతులు తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం తరలించేందుకు రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని అన్నారు. తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయాలని ఒక్కరోజు దీక్ష చేసినా పట్టించుకోలేదన్నారు. గ్రామస్థుల సహకారంతో రోడ్డు వేసుకున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణంపై మున్సిపల్ అధికారుల కొరడా

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణంపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. సిరిసిల్ల పట్టణం పెద్ద బజార్‌లోని పుల్లూరి సురేష్ నింబంధనలకు విరుద్ధంగా నాలుగు అంతస్తుల భవన నిర్మాణం చేపట్టాడు. సోమవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కమర్షియల్ షెట్టర్లను కూల్చేందుకు యత్నించగా భవన యజమాని కుమారుడు శివ మూడో అంతస్తు ఎక్కి కూల్చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో మంగళవారం మున్సిపల్ అధికారులు పోలీసు బందోబస్తుతో వచ్చారు. శివ మళ్లీ భవనం పైకి ఎక్కడానికి ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది షటర్లను కొంత భాగం కూల్చారు. దీంతో భవన యజమాని సురేష్ అక్కడే సొమ్మసిల్లి పడిపోవడంతో బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. బంధువుల విజ్ఞప్తి మేరకు మున్సిపల్ అధికారులు షెటర్లను కూల్చడం నిలిపివేశారు. భవనం యజమాని కుమారుడు శివ బుధవారం షెటర్లను తామే తొలగిస్తామని, మున్సిపల్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఇవ్వడంతో వెళ్లిపోయారు.

పర్శ హన్మండ్లుకు ప్రభుత్వ విప్ పరామర్శ

గంభీరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం శ్రీగాధలో బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లును ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. పర్శ హన్మండ్లు తండ్రి పర్శ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.

పరిపాలనపై దృష్టి సారించండి

(5వ పేజీ తరువాయి)

రోజూ ఎక్కడో ఒక చోట విద్యార్థులు ధర్నాలు చేస్తున్నారని అన్నారు. రైతు బంధు, కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు అందడం లేదని, చివరకు పోలీసుల కుటుంబాలు సైతం రోడ్లపైకి వచ్చాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో నేతన్నల ఆత్మహత్యలు పెరిగాయని, పాలమూరు ప్రాజెక్టు ఆగిపోయిందని, దళిత బంధు, బీసీ బంధు కోల్పోయారని, ఉద్యోగులు రిటర్మెంట్ బోనస్ కోల్పోయారని, జర్నలిస్టులు హక్కులు కోల్పోయారని అన్నారు. అన్నింటిలో నంబర్ 1గా ఉన్న తెలంగాణ 11 నెలల కాలంలో అన్నింటినీ కోల్పోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా పగాప్రతీకారాలు మర్చిపోయి సీనియర్ల సలహాలు తీసుకొని పరిపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ వంద ఏళ్ల ముందుకు తీసుకెళ్తే రేవంత్ రెడ్డి నాలుగు రాళ్లు వేసుకొని వెళ్తా అనుకుంటూ రాష్ట్రాన్ని వెనక్కి తీసుకుపోతున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్, బీఆర్ఎస్ నేతలు నారదాసు లక్ష్మణ్ రావు, ఏనుగు మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

రాజన్నను దర్శించుకున్న హరీష్‌రావు

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్‌లు తుల ఉమ, న్యాలకొండ అరుణ బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

రాజన్నను క్షమాపణ కోరుకో

(5వ పేజీ తరువాయి)

కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాడని, ఒక తట్టెడు మట్టి కూడా తీయలేదని అన్నారు. నువ్వు, మీ మామ మా ప్రాంతానికి ఏం చేశారని నిలదీశారు. రాజన్న ఆలయానికి ఏటా వంద కోట్లు కేటాయించనందుకు రాజన్న భక్తులకు, ఈ ప్రాంతంలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసినందుకు రైతులకు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల బడ్జెట్‌లో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 325 కోట్ల కేటాయించి పనులు ప్రారంభించామని, కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు, మల్రిపల్లి రిజర్వాయర్ పనులను హరీష్ రావు చూసి వెళ్లాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అందిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో గొర్ల స్కాం, బర్ల స్కాం, లిక్కర్ స్కాం, ఫార్ములా వన్ స్కాం.. ఇలా అన్నీ స్కామ్ లేనని అన్నారు. ఇప్పటికి మూడుసార్లు జరిగిన అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలన్నారు. గురుకుల పాఠశాలల గురించి హరీష్ రావు మాట్లాడితే నవ్వొస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిందని, గురుకులాల విద్యార్థులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. 20 ఏళ్ల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించిందని గుర్తు చేశారు. వడగళ్ల వానతో నష్టపోయిన ఏ ఒక్క రైతును గత ప్రభుత్వం ఆదుకోలేదని, ఇటీవల వడగళ్ల వానతో రైతులు నష్టపోతే ఎకరాకు పదివేల రూపాయల పరిహారం అందించామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ చరిత్రలోనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని తెలంగాణలోని రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ చేశారని, కొందరికి సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాలేదని తెలిపారు. వారికి కూడా త్వరలో రుణమాఫీ అవుతుందన్నారు. గల్ఫ్‌లో మరణించిన కార్మికులను ఆదుకుంటానని రేవంత్ రెడ్డి రాజన్న ఆలయం ముందు ఇచ్చిన మాట ప్రకారం మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేస్తున్నామని, వారి పిల్లలకు గురుకులాల్లో సీట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజాభవన్‌లో ప్రజా దివస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదేళ్లలో నేతన్నల బతుకులు ఆగం చేశారని, బతుకమ్మ చీరల పేరిట సిరిసిల్లలో కాటన్ పాలిస్టర్ వస్త్ర పరిశ్రమను ఆగం చేశారని అన్నారు. 241 కోట్ల బకాయిలను తామ ఇచ్చామన్నారు. నేతన్నల సహాయంతో గెలిచిన కేటీఆర్ యారన్ డిపో ఎందుకు తీసుకురాలేకపోయాడో అడగాలన్నారు. 50 కోట్లతో యారన్ డిపోను వేములవాడలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. 11 నెలల కాలంలో ప్రజల మధ్య నిత్యం ఎవరు ఉన్నారో వారికి తెలుసని, రెండు మూడు నెలలకు ఒకసారి వచ్చిపోయే వారి మాటలను ప్రజలు పట్టించుకోరని అన్నారు. ఆలయ విస్తరణ పనులు ప్రారంభించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలోనే వేములవాడకు రానున్నారని వెల్లడించారు. జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు, చొప్పదండి ప్రకాష్, ఎల్లె లక్ష్మీనారాయణ, నామాల లక్ష్మీరాజం, కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, పాత సత్యలక్ష్మి, మ్యాన ప్రసాద్, కొక్కుల రాజు, బైరి నాగరాజు, అన్నారం శ్రీనివాస్, కూరగాయల శ్రీశైలం, తోట రాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

రుద్రంగి, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని ప్రహ్లద పర్వతంపై వెలిసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు వేల సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. లక్ష్మీ నరసింహస్వామి కల్యాణో త్సవాన్ని ఏటా కార్తీక మాసంలో నిర్వ హించడం ఆనవాయితీ. క్రోధినామ సంవత్సర కార్తీక శుద్ధ చతుర్దశి గురువారం 14న సాయం త్రం 5.05 గంటలకు అశ్విని నక్షత్రయుక్త మేషలగ్న గోధులీకా సుముహూర్తాన స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొమురె శంకర్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించ నున్నారు. 15న జాతర (తిరునాళ్లు), భక్తులకు మహా అన్నదానం చేపట్టను న్నారు. మధ్యాహ్నం గరుడ సేవ, సాయంత్రం నిత్య వైష్ణవు లతో యక్ష గానం ఉంటుంది. 16న స్వామివారి రథోత్సవంతో మూడు రోజు లపాటు జాతర కొనసాగనున్నది. స్వామివారి జాతరకు జిల్లాతో పాటు జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి భక్తులు జాతరను తిలకించేందుకు పెద్దఎత్తున తరలిరానున్నారు. లక్ష్మీ నర సింహ స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొమురె శంకర్ తెలిపారు.



ముస్తాబవుతున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖ ద్వారం

పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మున్సిపల్ కార్యాలయాలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 11వ పీఆర్‌సీ ప్రకారం పెరిగిన వేతనాలు కార్మికులకు ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విజ్ఞప్తులు చేస్తే రెండు నెలల వేతనాలు ఇచ్చారని, మరో నాలుగు వేతనాలు ఇవ్వలేదని ఆరోపించారు. బతుకమ్మ, దసర, దీపావళికి ఇస్తారేమో అని కార్మికులు ఎదురు చూస్తే నిరాశే మిగిలిందన్నారు. తక్షణమే ప్రభుత్వం ఏరియస్, వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రమాద బీమా రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ. 26,900 చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, నాయకులు మంచికట్ల దామోదర్, ఎనగందుల లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు చక్రపాణి, ప్రవీణ్

పద్మశాలీల ఆత్మగౌరవాన్ని గాయపరుస్తున్న కేకే

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పద్మశాలీలను కించ పరుస్తున్నారని, సిరిసిల్లలో ఉపాధి లేక అప్పులు తీర్చలేక మనోవేదనతో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటే వ్యక్తిగత కారణాలతోనే చనిపోయారంటూ మాట్లాడి పద్మశాలీల ఆత్మగౌరవాన్ని గాయపరిచారని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్‌తో కలిసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన నేత కార్మికులు, ఆసాములు, యజమానులు రోడ్డెక్కిన సందర్భాలు లేవన్నారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో ఏం మార్పు జరుగుతోందో తమకంటే ప్రజలకు, పాత్రికేయులకే తెలుసన్నారు. రూ.కోటి 32 లక్షల చీరల ఆర్డర్లు ఇస్తామన్నారని, ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదని ఆరోపించారు. 365 రోజుల నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తామన్న ప్రభుత్వం ఎలాంటి ఉపాధి కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ చీరాల బకాయిలు రూ. 300 కోట్లు ఇచ్చామంటున్నారు ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వం అనేది నిరంతరం ఉండే ఒక వ్యవస్థని గత ప్రభుత్వంలో చేసిన పనులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎల్లకాలం ఉండదని ఈ ప్రభుత్వం పోయేటప్పుడు బకాయిలు పెడుతుందని దశలవారిగా కొత్త ప్రభుత్వం తీర్చాలని అన్నారు. సంవత్సర కాలంలో ఏమిచ్చారో ఆలోచన చేయాలన్నారు. ప్రతిసారి గత ప్రభుత్వం అంటూ నిందించడం మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే టెక్స్‌టైల్ పార్కుకు మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. రూ.180 కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం వర్కర్ టు ఓనర్ పథకాన్ని తీసుకొచ్చి 50 షెడ్లు కూడా నిర్మించిందన్నారు. ఎన్నికలు రావడంతో లబ్ధిదారుల ఎంపిక సాధ్యపడలేదని 11 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. పక్కనే ఉన్న అపెరల్ పార్కు, త్రిఫ్ట్ పథకం ఎవరి హయాంలో వచ్చిందో గుర్తు చేసుకోవాలన్నారు. ఉపాధి లేక అప్పులతో బైరి అమర్, స్రవంతి దంపతులు ఆత్మహత్య చేసుకుంటే వ్యక్తిగత కారణాలతోనే చనిపోయారంటూ పద్మశాలీల ఆత్మగౌరవాన్ని గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న బైరి అమర్ స్రవంతి దంపతులు త్రిఫ్ట్ పథకంలో ఉన్నారని దుర్గా భవానీ మ్యాక్స్ సొసైటీలో సభ్యత్వం ఉందని అన్నారు. రూ.90 లక్షల అప్పులతో ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులకు బంధువులు ఫిర్యాదు చేసినా పద్మశాలీలపై కనికరం కలగడం లేదన్నారు. యారన్ డిపో వేములవాడకు ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క గ్రైడెన్సీ లేదన్నారు. బతుకమ్మ చీరల బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ.60 నుంచి 70 కోట్లు మాత్రమే వచ్చాయని, మిగతా రూ.150 కోట్లు కేకే మహేందర్‌రెడ్డి తీసుకోవచ్చని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, సెస్ డైరెక్టర్ దార్ళం లక్ష్మినారాయణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మినారాయణ, వైస్ చైర్మన్ అడగట్ల మురళి, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, పాతూరి రాజిరెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ అడిచెర్ల సాయికృష్ణ, మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శి దిడ్డి రాజు, నాయకులు పాల్గొన్నారు.